

కూల్..కూల్

చలి తీవ్రత పెరగడంతో జనం గజగజ

● వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు ● చలి మంటలతో ఉపశమనం

● మరోవైపు ఉన్ని వస్త్రాల అమ్మకాల జోరు

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి)

శీతాకాలం ఆరంభంలోనే చలి అదరగొడుతోంది. రోజు రోజుకు చలి తీవ్రత అధికమవుతోంది. పట్టణ వాసులతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు చలికి వణికిపోతున్నారు. గత రెండు రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలోనే ఈవిధంగా ఉంటే ఇక మున్ముందు చలిగాలులు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. మరో పక్క చలి నుంచి రక్షించుకునేందుకు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో రగ్గులు, స్వెట్టర్లు అమ్మే ప్రత్యేక దుకాణాలు కూడా వెలుస్తున్నాయి.





దీపావళి పండుగ మరుసటి రోజు నుంచి చలికాలం ప్రారంభమతుంది అంటారు. చలికాలం ప్రారంభమై కేవలం కొన్ని రోజులే అయినా చలితీవ్రత మాత్రం అధికంగానే ఉంటుంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తెల్లవారుజాము నుంచే చలిగాలులు ప్రారంభమవుతూ క్రమేపీ పెరుగుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల వరకూ చలి తీవ్రత అలాగే ఉండటంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ప్రజలు శీతాకాల ప్రభావంతో జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఉదయం పరిస్థితి ఇలా ఉంటే సాయంత్రం పరిస్థితి మరోలా ఉంది. ఆరు గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగా మారిపోయి చలితీవ్రత ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ప్రారంభమైన చలిగాలులు రాత్రంతా కొనసాగుతున్నాయి. కూలి పనులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్ని వస్త్రాల అమ్మకాలు ప్రారంభం

శీతాకాలం అంటే గుర్తొచ్చేవి చలిమంటలు, వెచ్చని ఉన్ని వస్త్రాలు. ఈ సీజన్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, నేపాల్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పట్టణాలలో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం మామూలే. ఈ ఏడాది వెచ్చని నేస్తాలను విక్రయించేందుకు పట్టణాలకు వచ్చారు. ప్రస్తుతం చలి పెరుగుతుండటంతో ఉన్ని దుస్తుల అమ్మకాలు ఊపందుకున్నాయి. గతంలో అల్లికల స్వెట్టర్లను వినియోగించేవారు. ఇప్పుడు ఎక్కువగా యంత్రాలపై తయారు చేసిన ఉన్ని దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో వాటిపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. చలితో పాటు వర్షం నుంచి కూడా అవి రక్షణగా ఉండడంతో వాటికే డిమాండ్ ఎక్కువగా ఉంది. చెవులకు కప్పే మంకీ క్యాపులు, ఆఫ్ క్యాప్‌లు, చేతులకు గ్లౌజులు, చిన్నారులను ఆకర్షించే టెడ్డీ బేర్ తరహా దుస్తులు, రగ్గులు, సోలాపూర్, దుప్పట్లు వివిధ ఆకర్షణీయమైన రంగు బొమ్మలతో ముద్రించిన ఉన్ని దుస్తుల కొనుగోలుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు.



బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజానికి పెను సవాల్‌గా మారిన బాల్య వివాహాలను నిరోధించాల్సిన సామాజిక బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. బాల్య వివాహాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, అభివృద్ధి సూచికల సాధనకు అవరోధంగా మారాయన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో బుధవారం విద్యా వైద్య, ఇంటర్మీడియట్ బోర్డు, డీఆర్డీఏ, మహిళా శిశుసంక్షేమశాఖ, కార్మికశాఖల ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా విద్యావంతంగా మారడంతో పాటు సామాజికంగా గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. 11-18 సంవత్సరాల వయసు గల బాలికల్లో అపోహలు, అనుమానాలు తొలగించి వారికి ఒక బాధ్యతాయుతమైన భవిష్యత్తును అందించేందుకు ఆరు శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంటర్మీడియట్‌లో బాలికల డ్రాప్ అవుట్స్‌ను గమనిస్తూ ఉండాలన్నారు. కేరళ మాదిరిగా మన రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని డీఎల్డీవో ఎంఏకే భీమారావు పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. మానసిక వైద్యులు యోనస్, సౌమ్యశ్రీ బాలికల మానసిక స్థితిగతులను వయసు వారీగా పరివర్తన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పద్మజ్యోతి బాలికల సంక్షరణ వ్యవస్థల పనితీరుపై వివరించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, డీఎల్డీవో టి.త్రినాథరావు, ఎం.శాంతి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై ముగ్గురు మైనర్ల దాడి

వీడియో వైరల్..అరెస్టు

7లో



3 నెలలకు ఒకేసారి..

గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్‌దారుడు ప్రతీ నెల పెన్షన్ తీసుకోవాల్సిందే. ఒక నెల అందుబాటులో లేకపోతే తర్వాత నెలలో ఆ పెన్షన్ వచ్చేది కాదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఒక నెల పెన్షన్ నగదు తీసుకోకపోయినా ఆ మొత్తాన్ని తర్వాత నెల పెన్షన్‌తో కలిపి ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. ఒక్కో సందర్భంలో రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తం నగదును అందజేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఒక నెల తీసుకోకపోయినా పింఛన్ మంజూరు

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం.. పండుటాకులకు ఆనందం

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి):

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో వృద్ధులతో పాటు దివ్యాంగులు హర్షం ప్రకటిస్తున్నారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలోను ఇదే విధానాన్ని అమలు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో వృద్ధులకు నరకం చూపించారు.



పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్(ఫైల్)

వివిధ కారణాలతో..

అనారోగ్యంతో ఆసుపత్రుల్లో ఉండేవారు కొందరైతే, వయోభారంతో ఇతర ప్రాంతాల్లోని కుమార్తెలు, కుమారుల ఇళ్ల వద్దకు వెళ్లేవారు కొందరు. ఇలా వారు ప్రతీ నెల పెన్షన్ అందుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి వారికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతో ఊరట లభించింది. పెన్షన్ పంపిణీ నిర్ణయంపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ మాట్లాడుతూ మూడు నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పెన్షన్ పంపిణీకి సంబంధించి ఫైలు ఇప్పటికే ప్రభుత్వం ఆర్థికశాఖకు పంపించింది. త్వరలోనే ఉత్తర్వులు అందే అవకాశం ఉంది. ఉత్తర్వులు అందిన తర్వాత నిబంధనల మేరకు పెన్షన్లు పంపిణీ చేస్తాం.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే ఇక అంతే సంగతులు. ఆ పింఛన్ పోయినట్టే..ఈ నిబంధన అప్పట్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చాలా వేదన కలిగించేది. ఏదైనా కారణంతో ఆ రెండు మూడు రోజులు అందుబాటులో లేకుంటే పింఛన్ పోయేది. తర్వాత వలంటీర్‌ను అడిగినా స్పందించిన దాఖలాలు ఉండేవి కావు.. ఇప్పుడు ఇక ఆ కష్టాలు లేనట్టే..కూటమి ప్రభుత్వం పింఛన్‌దారులకు శుభవార్త చెప్పింది..

పెన్షన్ తీసుకోనివారు..2045 మంది

జిల్లా వ్యాప్తంగా 2,39,368 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతీ నెల ప్రభుత్వం రూ.99,44,08,500 నగదును కేటగిరీల వారీగా పంపిణీ చేయాల్సి ఉంది. నవంబరు నెలలో 2,37,323 మంది పెన్షన్‌దారులకు రూ.98.64 కోట్లు పంపిణీ చేశామని డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్ తెలిపారు. 2045 మంది వివిధ కారణాల వల్ల పెన్షన్ తీసుకోలేకపోయారు. వీరిలో 705 మంది మృతిచెందినట్టు గుర్తించారు. 346 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. 203 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో 605 మంది ఉండగా 186 మంది తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారని వివరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు జరిగితే ఇటువంటి పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది.

రైతు సమస్యలపై అసెంబ్లీలో

గళమెత్తిన ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై శాసనసభలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గళమెత్తారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మండపేట నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పంటకాల్వలు, డ్రైన్‌లు, తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పారు. దీంతో తుఫాన్లు వచ్చినప్పుడు, భారీ వర్షాలు వచ్చినప్పుడు పంట నష్టం కలుగుతుందన్నారు. పంట కాల్వలు కనీస మరమ్మత్తులకు, పూడికతీతకు కూడా నోచుకోకపోవటం వల్ల సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే శిథిలావస్థకు చేరిన వంతెనలు పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



చేపా..చేపా ఎక్కడమ్మా

అరుదైన.. జలపుష్పాలు

కానరాని పలు రకాలు

ప్రత్యేక కథనం 6లో

పీఎం సూర్యఘర్ పథకంతో ప్రయోజనాలు

●కలెక్టర్ మహేష్‌కుమార్ ●యూనిట్ల మంజూరు అంశాలపై చర్చ



సూర్యఘర్ పథకంపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్

అమలాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రతీ ఇంటికి రాయితీతో కూడిన సోలార్ విద్యుత్ యూనిట్‌లు అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పథకం అమలు తీరుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తొలుత వానపల్లి, పల్లిగూడెం, ఎస్.మూలపొలం, ఆర్తమూరు, చింతలపల్లి అన్నయ్యపేట గ్రామాలతో పాటు అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణ ప్రాంతాల్లో నూటికి నూరుశాతం పీఎం సూర్యఘర్‌కు సంబంధించి సర్వే పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మూడు కిలో వాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు రూ.78వేలు రాయితీతో ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకు రుణాల కల్పన ద్వారా రాయితీతో యూనిట్‌లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వాడుకోగా మిగలగా అది ఆయా ప్రజలకు ఆదాయంగా వస్తుందనే విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. సోలార్ యూనిట్ పెట్టుకునేందుకు అవకాశం ఉన్న ఇళ్లను గుర్తించి వారిచే దరఖాస్తు చేయించాలన్నారు. సోలార్ యూనిట్‌లు తమ ఉపకరణాలను సరఫరా చేసే సంస్థలు నాణ్యమైన వారంటీ గలవి మాత్రమే సరఫరా చేసే అంశంపై ఈ నెల 28న ఆయా ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి ఏకరూపు ధరలు నిర్ణయిస్తామన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.రాంబాబు మాట్లాడుతూ వినియోగదారులు పది కిలోవాట్ల వరకు ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందన్నారు. లబ్ధిదారుడు పది శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. యూనిట్ స్థాపించిన 45 రోజుల్లో సబ్సిడీ వినియోగదారుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు పీఎం సూర్యఘర్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ప్రతీ నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చునన్నారు. ఈ పథకం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ట్రాన్స్‌కో డీఈలు రవికుమార్, రత్నాలరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఎల్డీఎం కేశవవర్మ, డీపీవో డి.శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్‌లు అయ్యప్పనాయుడు, కేవీఆర్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మేలైన వరి వంగడాలతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్





నందకిశోర్

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు అనువైన వరి రకాలను ఎంపిక చేసుకుని రైతులు వాటిని సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం (ఏరువాక) ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ సూచించారు. రబీ వరి సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడంతో పాటు నూతన సాంకేతికతను అంది పుచ్చుకుంటూ తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను పొందవచ్చునన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే స్వల్పకాలిక వరి రకాలను ఎంపిక చేసుకోవాల్సిందిగా రైతులకు ఆయన సూచించారు. రబీ సీజన్‌కు అనువైన వరి వంగడాలను ఆయన వివరించారు. ఎంటీయూ 3626 (ప్రభాత్) వరి రకం 125 రోజులు కాలపరిమితి కలిగి గింజలు పొడవుగా, ముతకగా, లావుగా ఉంటాయని, దీన్ని బొండాలు అని పిలుస్తారని, ఇది అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుని వరిచేను పడిపోకుండా ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1121 (శ్రీధృతి) ఈ రకం 125 రోజులు కాలపరిమితి కలిగి దోమ పోటు, అగ్గి తెగులును తట్టుకుంటుందని, వరి కంకిలో చివరి వరకు గింజలు పాలు పోసుకుంటాయని, రాలిక తక్కువగా ఉంటుందని, చేలు పడిపోవని, విత్తనం వెదజల్లుటకు కోత యంత్రంతో చేను కోయడానికి అనువైందన్నారు. ఎకరాకు 55 నుంచి 60 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1156(తరంగిణి) వరి రకం 120 నుంచి 125 రోజులు కాల పరిమితి కలిగి దోమపోటు, అగ్గితెగులును తట్టుకుంటుందని, గింజలు రాలిక తక్కువని, ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1153 (చంద్ర) వరి రకం 115 నుంచి 120 రోజులు కాలపరిమితి కలిగి దోమపోటు, అగ్గి తెగులను తట్టుకుటుందని, చేను పడిపోదని, గింజ రాలిక బాగా తక్కువగా ఉందని ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1210 (సుజాత) వరి రకం 120 నుంచి 125 రోజుల కాలపరిమితి కలిగి దోమపోటు, అగ్గితెగులును తట్టుకుంటుందని, కాండం ధృడంగా ఉండి వరిచేను పడిపోదని, చేను రాలిక బాగా తక్కువగా ఉండి విత్తనం వెదజల్లేందుకు అనువైందని, ఎకరానికి 45 నుంచి 55 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1273 వరి రకం 120 రోజులు కాలపరిమితి కలిగి అగ్గి తెగులును, గోధుమరంగు మచ్చ తెగులును తట్టుకుంటుందని, గింజల నాణ్యత కలిగి ఉండి పొడవుగా ఉండే స్నరకం అని, గింజ రాలిక తక్కువగా ఉంటుందన్నారు. ఆఫ్రికా దేశాల ఎగుమతికి అనువైన రకమన్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. ఎంటీయూ 1293 రకం 120 నుంచి 125 రోజులు కాలపరిమితి కలగి అగ్గితెగులు, పొట్టు కుళ్లు తెగులు, టుంగ్రో వైరస్ తెగులు, ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుందని, చౌడును సమర్థవంతంగా తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే రకమన్నారు. పొడవుగా, సన్నగా ఉంటుందని, బియ్యం పొట్ట తెల్లగా లేకుండా ఉంటుందని, ఎగుమతికి అనువైన రకమన్నారు. ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు దిగుబడి ఇస్తుందన్నారు. రైతులు రబీలో వరి సాగుకు సంబంధించి ఏమైనా సమాచారం అవసరమైతే ఏరువాక కేంద్రం అమలాపురం, సెల్ 9440286682ను సంప్రదించాలని శాస్త్రవేత్త నందకిశోర్ కోరారు.

చేప..చేపా.. ఎక్కడమ్మా!



కనుమరుగవుతున్న మత్స్యసంపద

ఎన్ని రకాల చేపలు వచ్చేవి.. కొన్ని రకాల చేపల పేర్లు అయితే పలకడం కూడా వచ్చేది కాదు.. ఇప్పుడో ఒకటో రెండో రకాలు వస్తున్నాయ్.. ఏమైపోయిందా జలసంపద.. అలా అలా కనుమరుగైపోయిందంతే.. అటు సముద్రంలోకానీ.. ఇటు గోదావరిలో కాని కనుమరుగైన చేప జాతులు ఎన్నో ఉన్నాయి.. పూర్వం లెక్కపెట్టలేనన్ని చేప జాతులు ఉంటే.. నేడు ఒకటో రెండో రకాలు మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. మత్స్య సంపదకు పెట్టింది పేరైన మన ప్రాంతంలో గోదావరి, సముద్రంలో విలువైన చేపల రకాలు తగ్గిపోతున్నాయి. సముద్రంలో పరిశ్రమల నుంచి కలిసే రసాయన వ్యర్థాలతో జలాలు కలుషితమై మత్స్యసంపద అంతరించు పోతుండడంతో వాటి వృద్ధి లక్ష్యంగా ప్రతిఏటా నవంబరు 21న మత్స్య శాఖ ద్వారా ప్రపంచ మత్స్యదినోత్సవం నిర్వహి స్తున్నారు. నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



- అరుదైన.. జలపుష్పాలు
- కానరాని పలు రకాలు
- కొన్ని మాత్రమే లభ్యం
- గోదావరి వాసుల నిరాశ
- నాటికి.. నేటికీ ఎంతో తేడా
- ప్రభుత్వం దృష్టి పెట్టినా ఇంతే
- నేడు మత్స్య దినోత్సవం

కాకినాడ సిటీ/కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులస పులుసు.. వంజరం ఇగురు.. సొర పొట్టు.. రొయ్యల వేపుడు.. అబ్బా.. చదువు తుంటేనే నోరూరిపోతోంది కదూ.. ఉమ్మడి జిల్లాలో గోదావరి,సముద్రం, రిజర్వాయర్లు, చెరువుల్లో ఒక నాడు విరివిగా లభ్యమయ్యే చేపలు ఇవి.. మరి నేడు ఈ జాతులే కనుమరుగైపోయాయి. ఒకటీ అరా దొరుకుతున్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని సముద్రంలో మత్స్యకారులకు బోలెడు రకాల సముద్ర చేపలు లభ్యమయ్యేవి. యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, ధవళేశ్వరంల్లో గోదావరి చేపలు విరివిగా లభ్యమయ్యేవి. మరి నేడు మత్స్య సంపద కనుమరుగైపోతోంది.

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ జిల్లా నిలుస్తోంది. జిల్లాలోని ఉప్పాడ, తొండంగి, కాకినాడల్లో సముద్రంలో భారీగా చేపలవేట సాగుతోంది. ఇక్కడి మత్స్యకారులకు వివిధ రకాల చేపలు వలలకు పడుతుంటాయి. వంజరం, సందువా, కోనెం, మాగ,కొయ్యింగ, ట్యూనా రకాల చేపలు ఎక్కువగా దొరుకుతున్నాయి వీటితో పాటు రొయ్యలు, పీతలు పడుతున్నారు. అపోలో ఫిష్, ఎల్లలు, ఇంగిలాలు, టేకు, కార, కలివిందలు, కవళ్లు, నెత్తలు వంటివి పడుతున్నాయి. వీటికి డిమాండ్ భారీగా ఉంది. కాకినాడ నుంచి రోజూ వేల టన్నుల్లో చేపలు, రొయ్యలు, పీతలు ఎగుమతవుతున్నాయి.చేపలు చెన్నై, కేరళ, ముంబయి వంటి ప్రాంతాలకు ఎగుమతి జరుగుతోంది. టైగర్, రొయ్య, తెల్ల రొయ్యలు యూరోపియన్ దేశాలకు ఎగుమతవుతున్నాయి. సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా చెన్నైకు మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయి. పెద్ద సైజు రొయ్యలు, పెద్ద సైజు పీతలు ఎగుమతుదారులకు లాభాలను ఆర్జించి పెడుతున్నాయి. కాకినాడలో ఐదు చోట్ల చేపల మార్కెట్లు ఉండగా అక్కడ వీటి విక్ర యాలు జరుగుతున్నాయి.కుంభాభిషేకం రేవులో ఉదయం వేళ తాజా చేపలు, రొయ్యలు, పీతలు అందు బాటులో ఉంటాయి. కాకినాడ జిల్లాలో 403 మెకనైజ్డ్ బోట్లు(పెద్ద బోట్లు), 3709 ఫైబర్ బోట్లు కలిపి మొత్తం 4,523 బోట్లు సముద్రంలో మత్స్య వేట సాగిస్తున్నాయి. వీటిపై ఆధారపడి 26,749 మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. కాకినాడ, సముద్ర మత్స్య ఉత్పత్తులతోపాటు జిల్లాలో 9వేల హెక్టార్లలో రొయ్యల చెరువులు, చేపల చెరువులు ఉన్నాయి.మత్స్యకారులకు ఫిషింగ్ బోట్ల ద్వారా సముద్రంలో మత్స్యవేటపై శిక్షణ ఇచ్చే రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కాకినాడలో ఉంది.



కోనసీమలోను సముద్ర చేపలు

ఉప్పలగుప్తం/అల్లవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు,గోదావరి నదీపాయలలో చేపల వేట సాగిస్తూ మత్స్యసంపదపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సముద్రంలో వేల రకాల చేపలున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కొన్ని రకాలు మాత్రమే లభిస్తుంటాయి. ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం కేంద్రాలుగా జరిగే సముద్ర చేపల వేటలో విలువైన మాగ, సొర, నలుపు, తెలుపు చందువా, కట్టపరిగెలు, కొయ్యింగ, పండుగప్ప, టూనా, సావిడాలు, కాణాకాంతలు, పలు రకాల గొరకలు, మెత్తళ్లు, కొమ్మురపాములు, పీతలు, విలువైన రొయ్యలు లభిస్తున్నాయి. ఇక సీజనల్‌గా ఏట్లు, చీరమేను వంటి రకాలు లభ్యమవుతుంటాయి. ఒకప్పుడు పనికిరానివిగా భావించిన సముద్రం గొరకలకు



ప్రస్తుతం మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. కారా చేపల విలువను మాంసాహారులు గుర్తించారు. సముద్రంలో దొరికే జలుగు చేపల రుచి అబ్బా అనిపించకమానదు. గిరాకీ కారణంగా జలుగులు, పండగొప్పలను చెరువుల్లో పెంచుతున్నారు. సముద్రంలో వాటినే మాత్రమే అందరూ ఇష్టపడుతున్నారు.





పులసలకు కేంద్రం యానాం..

అరుదైన చీరమేను కూడా దొరికేది ఇక్కడే

యానాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాం గోదావరిలో దొరికే చేపలకు ఎంతో గిరాకీ ఉంటుంది. ముఖ్యంగా గోదావరికి ఎర్రనీరు(వరద) వచ్చిందంటే చాలు పులసల వేట మొదలవుతుంది. తూర్పుగాలుకు, వర్షానికి చీరమేను దొరుకుతుంది.ఈ ఏడాది ఇక్కడ చీరమేను ఆత్యధికంగా దొరకడం విశేషం. భారీ పండుగొప్పలు, ఎర్రచంగలం, తెల్ల చెంగలం, మగా, తెల్ల చందువా, నల్ల చందువా, సీదా చందువా, కట్టా చేపలు, పితాలు, గుడ్డు పితలు, తెల్ల, సేకా, పప్పు, గుడ్డు రెయ్యలు, మెత్తళ్లు, వివిధ రకాల దొందులు, ఏట్లు, రావలు, టేకు తదితర చేపలు యానాం గోదావరిలో లభ్యమవుతాయి.

మత్స్యకారులకు సమగ్ర సమాచారం



సముద్రంలో వాతావరణ పరిస్థితులు, మత్స్య సంపద లభ్యమయ్యే ప్రదేశాలు తెలుసుకునేందుకు సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తెచ్చాం. మత్స్యకారులకు సబ్సిడీపై పరికరాలు, వేట విరామ పరిహారం అందజేస్తున్నాం.

-జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకరరావు



తగ్గిన విలువైన రకాలు

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతంలో ఒకప్పుడు భారీస్థాయిలో చేపలవేట జరిగేది. ప్రస్తుతం సముద్రంలో చేపలు పడడం తగ్గింది. గతంలో ఇక్కడ చాలా ఖరీదైన, రుచికరమైన చేపలు, రొయ్యలు దొరికేవి. పెద్ద జాతి చేపలకు చెందిన వంజరం, కోనాము,సంధువా, మునివా లం, మాగ, సిదుములు, పెద్ద పెద్ద పట్టి సావ డాలు, టైగర్ జాతి రొయ్యలు, సొర్రలు, పండుగప్పలు, సించు చేపలు విరివిగా మత్స్యకారుల వలలకు దొరికేవి.క్రమేపీ తీరప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు నెలకొల్పడం, డీప్ సీలో ఓడల నుంచి విడుదల చేసే వ్యర్థ రసాయనాలతో మత్స్యసం పద తగ్గిందని మత్స్యకారులే చెప్తున్నారు.

ఏటా 7 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి

మత్స్య సంపద ఉత్పత్తికి కేరాఫ్ కడియం

కడియం,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల పేరు చెబితేనే మత్స్య సంపద గుర్తుకొస్తుంది. ఫేమస్ అయిన చేపలన్నీ ఈ జిల్లాలోనే లభ్యమవుతాయి. గోదావరినది, చెరువులు, రిజర్వాయర్‌ల్లో పెరిగే మత్స్య సంపదకు మంచి గిరాకీ ఉంది.ఈ మత్స్యసంపద ఉత్పత్తికి తూర్పుగోదావరి జిల్లా కడియం కేంద్రంగా మారింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోనసీమ, మెట్ట, కాలవ కింద ప్రాంతాలకు చేపపిల్లలను కడియం మత్స్యక్షేత్రం నుంచి పంపిస్తుంటారు. ప్రతిఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఏడు కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుంటారు.జిల్లాలో ప్రధానంగా బొచ్చె, రాగండి, మ్రిగాల రకాల చేప పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. జిల్లాలో 41 కిలోమీటర్ల పొడవుతో 10 వేల హెక్టార్ల నీటి విస్తీర్ణంతో గోదావరి నదిపై చేపల ఉత్పత్తుల ద్వారా 1843 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు బ్రీడింగ్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తి సాగుతుంది. ప్రతిఏటా కడియం మత్స్య క్షేత్రం నుంచి 25 నుంచి 30 లక్షల చేపపిల్లలు, జిల్లావ్యా ప్తంగా 50 లక్షల చేప పిల్లలు ఉత్పత్తి సాగుతోంది.ఇక్కడి నుంచి 3ఎంఎం పరిమాణం లో చేపలు(స్పాన్) తయారు చేసి ఫిషర్‌మెన్ సొసైటీలకు,అమలాపురం, ద్వారాపూడి, రాజవోలు,కొత్త పేట,రంపచోడవరం, రాజవొమ్మంగి, నిడదవోలు,సీతానగరం,బిక్కవోలు చేపల కేంద్రాల కు పంపించి అక్కడ 50 నుంచి 80 ఎంఎం పరిమాణంలో ఫింగర్ లింగ్స్ తయారు చేస్తారు. తర్వాత గోదావరిలో వదులుతారు. ఈ ఏడాది 7 కోట్ల మేర చేపపిల్లల(చేపచిరునారు) ఉత్పత్తి లక్ష్యం కాగా నూరుశాతం ఉత్పత్తి సాధించారు.



29.83 లక్షల చేపపిల్లలు వదిలాం



2023-24లో ఫింగర్‌లింగ్స్ పథకం ద్వారా మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా 50 నుంచి 80 ఎంఎం పరిమాణం ఉన్న 29.83 లక్షల చేపపిల్లలను గోదావరిలోకి వదిలాం. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీఎస్ఏడీఏ) యాక్ట్ కింద రైతులు ఆక్వాసాగు చేసుకునేలా అనుమతులు ఇస్తున్నాం.

-వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

మన్యం స్పెషల్.. 'ఎరగడ'

చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎరగడ చేపలు.ఈ తరహా చేపలు కేవలం మన్యానికే పరిమితం.వారాంతపు సంతలే వీటి విక్రయ కేంద్రాలు.ఆదివాసీ మహిళలు వారి గ్రామ సమీపాల్లో జరిగే వారాంతపు సంతల్లో అమ్ముతుంటారు. ఒక్కో పోగు రూ.50 వరకు ఉంటుంది. వాగులు, వంకలు, చెరువులు, వరి పొలాలు.. ఇవన్నీ ఎరగడ చేపలు లభ్యమయ్యే ప్రదేశాలు. వేటకు పందిరి వలలు, చిక్కాలు, చేతివలలు వినియోగిస్తుంటారు.ఆదివాసీలకు ఎరగడ చేపలు ఆదాయ వనరుల్లో ఒకటి. వరి పొలాల్లో చేపల వేటకైతే ఒకట్రెండు కుటుంబాల వరకే పరిమితమవుతారు. పెద్ద చెరువుల్లో వేటకు మాత్రం వందల సంఖ్యలో కుటుంబాలు రంగంలోకి దిగుతుంటాయి.అక్కడ దొరికిన చేపల్ని ఒక పెద్ద పోగుగా పోసి తర్వాత అక్కడ వేటకు ఎన్ని కుటుంబాలు హాజరైతే అన్ని కుటుంబాల వారూ సమానంగా పంచుకుంటారు.ఆ వేటలో వివిధ రకాల సైజు చేపలు లభ్యమవుతుంటాయి. వాటిలో చిన్న సైజు చేపల్ని ఎంపిక చేస్తారు. అనంతరం వాటిని వరి గడ్డిపై పరిచి కాల్చుతారు. ఒక మోస్తరుగా చేపలు కాలిన తర్వాత వాటిని తిరిగి ఎండలో నాలుగైదురోజులపాటు ఆరబెడ తారు. వీటినే ఎరగడ చేపలంటారు. ఈ చేపల్ని నెల నుంచి రెండు నెలల వరకు నిల్వ చేసు కునే అవకాశం ఉంది. మన్యంలో ఇష్టమైన కూరల్లో ఒకటి ఎరడగ చేపల కూర.







శునకాల నేస్తం!









- వీధి కుక్కలకు ప్రతిరోజూ అన్నదానం
- తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పని
- ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా చేస్తున్న దంపతులు
- కాకినాడలోని వివిధ ప్రాంతాల్లో శునకాలకు అన్నదానం
- మొత్తం సొంత ఖర్చుతోనే.. విరాళాలు స్వీకరించరు
- రోజుకో రకం కూర, అప్పుడప్పుడూ చికెన్ కూడా..
- మూగజీవాలపై ప్రేమను చాటుతున్న దంపతులు



వీధి కుక్కలకు అన్నం పెడుతున్న కంటిపూడి రాంబాబు.. (పైన) కంటిపూడి రాంబాబు, ఆయన సతీమణి సత్యవేణి

సరిగ్గా వేకువజాము 5 గంటలు.. ఒక పెద్దాయన ఇంటి నుంచి జేబులో పేపర్లు పెట్టుకుని.. ఓ వైపు బకెట్ తగిలించుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరతాడు.. కొంతదూరం వచ్చి ఓ చోట ఆగుతాడు.. అప్పుడు ఆ పరిసరాల్లోని వీధి కుక్కలన్నీ ఆయన్ను చూసి వెంటనే పరుగుపరుగున అక్కడకు వచ్చేస్తాయి. ఆయన తన జేబులోని ఓ పేపర్ కింద వేసి ఆ బకెట్‌లోంచి అన్నం తీసి అందులో వేస్తాడు.. అప్పటికే ఆకలి మీద ఉండే ఆ శునకాలు వెంటనే ఆ అన్నం తినేస్తాయి. ఆయన మళ్లీ ఇంటికెళ్లి ఇంకో బకెట్‌తో బయటకు వచ్చి వేరే ప్రాంతానికి వెళ్తారు.. అలా మధ్యాహ్నం 2 గంటల వరకు ఇదే పని. రోజూ ఐదారు బకెట్లతో అన్నం శునకాలు పెడుతుంటారు.. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో ఎనిమిదేళ్లుగా ఓ పెద్దాయన శునకాలపై ప్రేమతో ఇలా చేస్తున్నారు. ఆయన భార్య కూడా ఈ మహత్కార్యంలో భాగమయ్యారు. రోజూ తెల్లవారుజామున 3 గంటలకు లేచి భోజనం తయారు చేయడమే పనిగా పెట్టుకున్నారు.

కాకినాడ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తోటివారికి, కన్నవారికీ అన్నం పెట్టని రోజులివి.. ఒకరిద్దరికి అన్నదానం చేసి పదిమందికి చెప్పుకుంటున్నవారు ఎందరో ఉంటున్నారు.. కానీ వీళ్లు ఎనిమిదేళ్లుగా కొన్ని వందలాది వీధికుక్కలకు రోజూ క్రమం తప్పకుండా అన్నం పెడుతూ.. మానవత్వం చాటుకుంటున్నారు. కంటిపూడి రాంబాబు, సత్యవేణి దంపతుల స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట. పిల్లల చదువుల నిమిత్తం 2000 సంవత్సరంలో కాకినాడలోని తోట సుబ్బారావు నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు శబరీష్ ఉన్నాడు. రాంబాబు గతంలో వ్యవసాయం చేసేవారు. పిల్లలకు ఉద్యోగాలు రావడం.. ఆయనకూ వయసు పైబడడంతో కొన్నేళ్లుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండేవారు. సహజంగా జంతు ప్రేమికుడైన రాంబాబుకు రోజూ బయటకి వెళ్లినప్పుడు తారసపడే వీధి కుక్కలను చూస్తుండేవారు. అవి ఆకలితో అలమటించడం చూసి చలించిపోయేవారు. ఆకలి ఎవరిదైనా ఒకటే. అడగనిదే అమ్మైనా పెట్టదు అంటారు.. కానీ మూగజీవాలు నోరు తెరిచి అడగలేవు కదా ఎలా అని ఆలోచించారు.. అదే విషయాన్ని తన భార్యకు చెప్పారు. అలా వీధికుక్కలకు రోజూ అన్నం పెట్టాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. అలా ఈ ప్రయాణం 2016లో ప్రారంభించారు. మూగజీవాలకు కడుపు నింపాలన్న ఈ దంపతుల ఆలోచన వారి కుమారుడు శబరీస్ తోడయ్యాడు. అతడు రిలయన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా ప్రతినెలా వీరికి రూ.15 వేలు పంపిస్తున్నాడు. ఈ డబ్బులతోపాటు వీరు రూ.5వేలు కలిపి మొత్తం రూ.20వేలతో వీధి కుక్కలకు రోజూ అన్నం పెట్టే కార్యక్రమం చేపడుతున్నారు. దీని గురించి వీరు గొప్పగా చెప్పుకోరు. ఈ అన్నదానానికి ఎవరి నుంచి సహాయం తీసుకోరు. తమ సొంత డబ్బులతోనే కుక్కలకు ఆకలి తీరుస్తున్నారు. వీళ్లు అన్నదానంతోపాటు వీధి కుక్కలకు ఎక్కడైనా గాయాలైనా సొంత ఖర్చుతోనే వైద్యం కూడా చేయిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లోని బోట్ క్లబ్, వెంకట్‌నగర్, సురేష్‌నగర్, గొడారిగుంట, ఆర్టీవో కార్యాలయం రోడ్డు, నాగమల్లితోట జంక్షన్, డీమార్టు ఏరియా, మూడుగుళ్ల సెంటర్, తోట సుబ్బారావు నగర్, ప్రాంతాల్లోని రాంబాబు వీధికుక్కలకు రోజూ ఆహారం పెడుతున్నారు. దీనికోసం రాంబాబు భార్య సత్యవేణి ప్రతిరోజూ తెల్లవారుజామున 3గంటలకు నిద్ర లేస్తారు. వంట చేయడం ప్రారంభించి 5 గంటలకు ముగిస్తారు. ఒక్కోరోజు ఒక్కో మెనూ ఉండేలా చూస్తారు. పెరుగన్నం, కాయగూరలతో కూరన్నం, ఒక్కోసారి చికెన్ తయారు చేస్తుంటారు. అలా తయారుచేసిన ఆహారాన్ని ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆయా ప్రాంతాల్లో అన్నం బకెట్‌ను బైక్‌కు తగిలించుకుని కనిపించిన ప్రతి కుక్కకు ఆహారం పెడుతుంటారు. ఇలా ప్రతిరోజూ 5నుంచి 6 బకెట్‌ల వరకూ ఆహారాన్ని కుక్కలకు పెడుతున్నారు. 8ఏళ్లుగా ఆ కుటుంబం ఈ విధంగా చేస్తోంది.

అందరూ ఆహారం అందించాలి

జంతువులన్నింటికంటే కుక్క విశ్వాసం గలది. వీధికుక్కలకు ఆహారం, తాగేందుకు నీరు ఇస్తే అవి ఎవరికీ హానిచేయవు. తమ ప్రాంతాల్లోని కుక్కలకు సమాజంలోని ప్రతిఒక్కరూ ఆహారం, తాగు నీరు అందించాలి. మూగజీవాలపట్ల జాలి, దయ చూపాలి. నాకు ఓపిక ఉన్నంతకాలం వీధి కుక్కలకు అన్నం పెట్టడం కొనసాగిస్తాను. ఏదొక మంచి పనిచేయాలనే ఉద్దేశంతో నేను, నా భార్య, కుమారుడు కలిసి కుక్కలకు అన్నం పెడుతున్నాం.

- కంటిపూడి రాంబాబు, జంతు ప్రేమికుడు

ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీకి

ఒక నామినేషన్ ఉపసంహరణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి దాఖలు చేసిన నామినేషన్లలో బుధవారం ఒక నామినేషన్‌ను ఉపసంహరణ జరిగినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అహ్మద్ షేక్ అనే అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. 21వతేదీ వరకు ఉపసంహరణలకు సమయం ఉండడంతో బరిలో ఎవరు నిలుస్తారో అనేది గురువారం సాయంత్రానికి తేలనుంది.


ఇందుకూరు-1 గ్రామంలో చలి మంట కాగుతున్న ప్రజలు

మన్యంలో చలి పులి

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెలాఖరు రావడంతో మన్యంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఏజెన్సీలో గ్రామాలన్నీ సాయంత్రం ఐదు గంటలకే చీకటిగా మారుతున్నాయి. పొగ మంచు కమ్మేయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావట్లేదు. తీవ్రమైన చలి నుంచి బయటపడ్డానికి మంట వేసుకుని కాగుతున్నారు. మున్ముందు చలి మరింత పెరుగుతుందని స్థానికులు చెప్తున్నారు.



తల్లి ప్రేమకు సాటి లేదు...

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట జయలక్ష్మి థియేటర్ సమీపాన ప్రకాష్‌నగర్ నీలిమా శ్రీను ఇంటి ఎదురుగా ఒక వీధి కుక్క పిల్లను మోటారు సైకిలు ఢీకొనడంతో తలపగిలి మృతి చెందింది. దీంతో అప్పటిదాకా తన వద్దే పాలు తాగుతున్న తల్లి కుక్క తల్లడిల్లింది. అప్పటికే ఐదు పిల్లలు పాలు తాగాయి. పిల్ల కుక్క మృతి చెందిందన్న విషయం తెలియక దానిని సాకుతూ నువ్వూ పాలు తాగు అని లేపుతున్నట్టుగా కనిపించిన దృశ్యం ఆ దారిన వెళ్లే పలువురిని విస్మయపరిచింది.



కార్తీకంలోనూ అ'ధర'హో



శీతాకాలం నేపథ్యంలో
గుడ్డు ధరకు రెక్కలు
పౌల్ట్రీ నిర్వాహకులకు ఊరట
టోకుగా రూ.5.65
చిల్లరగా రూ.7కి విక్రయం

మండపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో కూడా గుడ్డు ధర పరుగులు పెడుతోంది. పెరుగుతున్న ధర కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతుంటే సామాన్యుడికి మింగుడుపడట్లేదు. రెండేళ్ల పాటు ఒడిదుడుకులు ఎదుర్కొన్న కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఊపిరి పోసుకుంటోంది. గతంలో నష్టాల కారణంగా చాలా మంది రైతులు పిల్లలు బ్యాచ్‌లను వేయలేదు. దానివల్ల గుడ్డు డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడం ధరల పెరుగుదలకు కారణమని పౌల్ట్రీల నిర్వాహకులు చెప్తున్నారు. గుడ్డు తయారీకి రూ.4.80 అవుతుంది. ధర ఐదు రూపాయలు దాటి ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు వున్నాయి. వీటిలో సుమారు 1.40 కోట్ల కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. స్థానిక అవసరాలకు 40శాతం గుడ్లు వినియోగిస్తుండగా 60శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, బెంగాల్‌లకు ఎగుమతి అవుతాయి. కోళ్ల పరిశ్రమ కొన్నేళ్లుగా నష్టాల్లో కూరుకుపోగా తాజాగా పెరిగిన గుడ్డు ధర కాస్త ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.5.65కి చేరింది. బయట మార్కెట్లో చిల్లరగా రూ.6.50 నుంచి రూ.7 దాకా విక్రయిస్తున్నారు.


శిఖర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకస్వాములు, తిలకిస్తున్న భక్తులు

ఘనంగా భావనారాయణస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పురాతన క్షేత్రం సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్ద పుల్ల శ్రీరాములు, ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను, దాతల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి మూలవరులకు స్నపన తిరుమంజనం, కళావాహన, గోదర్శనం, అష్టోత్తర శత ఘటాభిషేకం, శాంతికర కల్యాణం, పంచామృతాభిషేకం, పలు రకాల విశేష ద్రవ్యాలతో హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో స్వామివారి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర కలశ, సుదర్శన చక్రం ప్రతిష్ఠ వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన బూరెలను శిఖరంపై ఉంచి పూజలు చేశారు. వాటిని స్వామివారికి నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు చీర కొంగుల్లో బూరెలను ఒడిసిపట్టుకుని ప్రసాదం స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప కమిషనరు కార్యాలయ సూపరింటెండెంట్ సోమరాజు, కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశ్, పుల్ల వీరబాబు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, మానేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.


భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

గండిపోశమ్మ దర్శనం పునః ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. జూలైలో వచ్చిన వరదలకు గోదావరి ఉప్పొంగి గండిపోశమ్మ ఆలయం ముంపునకు గురైంది. దీంతో అమ్మవారి దర్శనాలకు భక్తులు దూరమయ్యారు. వరద దగ్గి అమ్మవారి ఆలయం బయటపడడంతో అధికారులు ఆలయాన్ని శుభ్రపరిచి సంప్రోక్షణ చేశారు. అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా భక్తులు 108 బిందెలతో గోదావరి జలాలు తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. గండిపోశమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవచ్చని, అన్ని ఏర్పాట్లు చేశామని దేవస్థానం ఈవో లక్ష్మీకుమార్ తెలిపారు. పూజల అనంతరం అన్నదానం చేశారు. ఆదివారం భక్తుల సంఖ్య అధికం కానున్న దృష్ట్యా మరిన్ని ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు.

రాజమహేంద్రవరంలో జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రారంభం



రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేలిమి బంగారు ఆభరణాల అమ్మకంలో పేరెన్నిక గన్న జీఆర్‌టీ జ్యువెలర్స్ తన 61వ షోరూమ్‌ను తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని శ్యామల థియేటర్ వద్ద బుధవారం ప్రారంభించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ చారిత్రక నగరంలో తమ షోరూమ్‌ను ప్రారంభించినందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా తమ కస్టమర్లకు ప్రత్యేకమైన ప్రయోజనాలు, ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50, బంగారు ఆభరణాల వేస్టేజిపై 20 పర్సెంట్ (వీఏ), డైమండ్ విలువపై క్యారెట్‌కు రూ.10వేలు తగ్గింపు ఇస్తున్నామన్నారు. వెండి వస్తువులు, పట్టీల మేకింగ్ చార్జీలపై 25 శాతం, అన్‌కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు పొందవచ్చన్నారు. 1964లో ప్రారంభమైన నాటి నుంచి జీఆర్‌టీ జ్యువెలర్స్ నాణ్యత పట్ల నిబద్ధత కలిగి, ప్రాంతీయ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన బంగారం, డైమండ్, ప్లాటినం, వెండి జాతి రత్నాల ఆభరణాల విభిన్న ఎంపికను అందజేస్తోందన్నారు. ప్రత్యేక, శాశ్వతమైన డిజైన్లను నైపుణ్యం కలిగిన కళాకారులతో కచ్చితత్వంతో రూపొందిస్తామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ నిజమైన హస్తకళను ప్రతిబింబించే టైంలెస్ అభరణాలను రూపొందించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. గొప్ప వారసత్వానికి, ప్రఖ్యాతిగాంచిన రాజమహేంద్రవరం వాసులకు నాణ్యత గల ఆభరణాలను అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.


నిడదవోలు పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారం

గుమస్తాయే అసలు నిందితుడు

బంగారం, నగదు చోరీ కేసును ఛేదించిన నిడదవోలు పోలీసులు


నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు సీఐ తిలక్ బుధవారం వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి... ఈనెల 14వ తేదీన తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం బంగారు నగల దుకాణానికి తీసుకు వెళ్లేందుకు తన గుమస్తా అయిన అమర్‌కు షాపు యజమాని 289.340 గ్రాముల బంగారం ముక్కలను, రూ.6.30 లక్షల నగదు ఇచ్చారు. నిడదవోలు వచ్చేసరికి శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం పొదల్లో డబ్బు, బంగారం దాచి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి వాటిని దోచుకుపోయారని అతడు యజమానికి చెప్పాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు నిడదవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అమర్ దురుద్దేశంతో పథకం ప్రకారం బంగారం నగదు దాచి దొంగతనం డ్రామాకు తెరలేపాడని తెలిసింది. అమర్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో బుధవారం అమర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 23.64 లక్షలు ఉంటుంది. సమావేశంలో పట్టణ ఎస్ఐ శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో చిరుద్యోగికి కుచ్చుటోపీ

మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావంటూ వాట్సాప్ వీడియోకాల్‌లో బెదిరింపు
రూ.25వేలు స్వాహా చేసిన సైబర్ మోసగాడు

కరప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసగాడు ఒక చిరుద్యోగి నుంచి రూ.25వేలు స్వాహా చేశాడు. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన పెనుబోతుల రాజుకుమార్ గురజనాపల్లిలోని ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు డ్యూటీలో ఉండగా ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి మీ ఆధార్ కార్డుపై ఎవరో సిమ్‌కార్డు తీసుకుని ఇల్లీగల్ యాక్టివిటీస్ (చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు) చేస్తున్నారని భయపెట్టాడు. అనంతరం మరో వ్యక్తి రాజుకుమార్ ఫోన్‌కు వాట్సాప్ వీడియో కాల్ చేసి ముంబయి పోలీసునని పరిచయం చేసుకున్నాడు. కాల్ చేసిన వ్యక్తి పోలీస్ యూనిఫామ్‌లోను, అతని వెనుక సెటప్ అంతా పోలీస్‌స్టేషన్‌ను పోలి ఉండేసరికి రాజుకుమార్ కంగారుపడ్డాడు. తన పేరు, ఆధార్ కార్డు నెంబరు కరెక్ట్‌గా చెప్పేసరికి నమ్మి సైబర్ కేటుగాడికి పూర్తిగా సహకరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని, ఎవరూ లేని గదిలోకి వెళ్లాలని బెదిరించాడు. రాజుకుమార్ వద్ద మరో మొబైల్ ఫోన్ ఉందని తెలుసుకుని దాన్ని స్విచ్ఛాఫ్ చేయాలని ఆదేశించాడు. ఎనీ డెస్క్ యాప్ సాయంతో రాజుకుమార్ మొబైల్‌ను సైబర్ మోసగాడు స్వయంగా ఆపరేట్ చేస్తూ పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావని, రూ.2.59 కోట్ల మేర లావాదేవీలు జరిపావని బెదిరించాడు. దీనిపై కేసు నమోదు చేశామని, అందుకనే డిజిటల్ అరెస్ట్ చేశామని చెపుతూ ఎఫ్ఐఆర్ కాపీతో పాటు మరికొన్ని పత్రాలను రాజుకుమార్‌కు వాట్సాప్ చేశాడు. కోర్టు ఫీజుల కింద వెంటనే రూ.25వేలు పంపించాలని హుకుం జారీ చేశాడు. సైబర్ కేటుగాడి మాటలకు హడలిపోయిన రాజుకుమార్ అతను చెప్పినట్టుగా తక్షణం రూ.25వేలను యూపీఐ పేమెంట్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత మరో రూ.25వేలు పంపించాలని కేటుగాడు డిమాండ్ చేయడంతో ఇక తన వద్ద డబ్బులేదని కరప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయిపోతానని రాజుకుమార్ చెప్పాడు. అయితే అంతవరకు లైన్‌లోనే ఉంటానని, అక్కడకు వెళ్లి పోలీసులకు ఫోన్ ఇవ్వాలని ఆదేశించాడు. ఫోన్ మాట్లాడుతూనే బండిపై నడకుదురు వద్దకు వచ్చేసరికి సైబర్ మోసగాడు ఫోన్ కట్‌చేసి రాజుకుమార్ వాట్సాప్‌కు అప్పటివరకు పంపిన పత్రాలు, ఇతర డేటాను పూర్తిగా డిలీట్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజుకుమార్ కరప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని ఎస్ఐ తోట సునీతకు తెలిపాడు. సైబర్ మోసగాడు ఇంగ్లీష్‌లో సంభాషిస్తూ రెండు గంటల పాటు తనను ఇబ్బందులకు గురి చేశాడని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డానని, ఇల్లీగల్ యాక్టివిటీస్ చేస్తున్నానంటూ బెదిరించి రూ.25వేలు కాజేశాడని బాధితుడు వాపోయాడు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయమని, 1930కు కాల్ చేసి సైబర్ కేసు నమోదు చేయాలని పోలీసులు బాధితుడికి తెలిపారు. ప్రజలు సైబర్ మోసాగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తపడాలని ఎస్ఐ తోట సునీత సూచించారు. సైబర్ మోసాలపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టనున్నట్టు ఆమె చెప్పారు.

కాగా వారం క్రితం ఒక విలేకరికి ఒక సైబర్ మోసగాడు వీడియో కాల్ చేసి ఫారిన్‌లో ఉన్న తన కుమార్తెను అరెస్టు చేశామంటూ ఇలాగే బెదిరించాడు. ఒక అమ్మాయి ఏడుపు వినిపించి డబ్బులు గుంజే ప్రయత్నం చేశాడు. అయితే అదే సమయంలో ఇంట్లోనే ఉన్న సదరు విలేకరి పెద్ద కుమార్తెతో ఫారిన్‌లో ఉన్న తన చిన్నకుమార్తె ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఫేక్ కాల్‌గా గుర్తించి ఫోన్ కట్ చేశాడు. మరలా బుధవారం మరో సైబర్ కేటుగాడు అదే విలేకరికి వీడియో కాల్ చేయగా అతను ఫోన్ కట్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కరపకు చెందిన ఒక వ్యక్తికి బుధవారం పోలీస్ గెటప్‌లో ఉన్న వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేస్తున్న దృశ్యం


తేజశ్రీని అభినందిస్తున్న జనసేన నేత శ్రీనివాసరావు


టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా తేజశ్రీ

గొల్లప్రోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా భీమన తేజశ్రీ ఎంపికయ్యారు. ఈమె జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న భీమన రమణమూర్తి సతీమణి. ఐస్ కర్లింగ్ క్రీడలో స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో తేజశ్రీ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. ఆమె మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి పిఠాపురం నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులను 27, 28 తేదీల్లో సరిచేసుకోవచ్చని చెప్పారు.

యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడని...
ఓ విద్యార్థిపై ముగ్గురు మైనర్ల దాడి


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

దాడి చేస్తూ వీడియో చిత్రీకరణ
సోషల్ మీడియాలో వైరల్ కావడంతో
రంగంలోకి దిగిన పోలీసులు

మలికిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమిస్తున్న యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడనే నెపంతో ఓ విద్యార్థిని ముగ్గురు మైనర్లు చావుదెబ్బలు కొట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మలికిపురంలో ఈ నెల 5న జరిగిన ఈ దాడికి సంబంధించిన వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వైగోవిందరావు వెల్లడించారు. చదువు మానేసిన ముగ్గురు మైనర్లు ఈ నెల 5న మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని మోటారు సైకిల్‌పై తీసుకువెళ్లి సత్యజ్యోతి థియేటర్ వెనుక చితకబాదారు. అమ్మాయికి ఎందుకు మెసేజ్‌లు పెడుతున్నావంటూ ఒకరి తర్వాత ఒకరు దాడి చేశారు. దీంతో విద్యార్థి చావు అంచుల వరకు వెళ్లాడు. దాడి అనంతరం మలికిపురం వేంకటేశ్వరస్వామి గుడి వద్దకు తీసుకువచ్చి వదిలారు. దెబ్బలు తిన్న విద్యార్థి తీవ్ర గాయాలపాలైనా తల్లిదండ్రులకు మాత్రం విషయం చెప్పలేదు. ఈ ఘటనను వీడియో షూట్ చేయించి ఎడిట్ చేయించగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై మలికిపురం పోలీసులు తక్షణం స్పందించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వీడియోలో ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు పంపుతామన్నారు. విలేకరుల సమావేశంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, ఎస్ఐ పి.సురేష్ పాల్గొన్నారు.

చాగల్లు హైస్కూల్ హెచ్ఎం సస్పెన్షన్

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తూర్పు గోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు తెలిపారు. వీర్రాజు విధుల్లో అలసత్వం వహించడంతో పాటు అనర్హులకు టీసీలు విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సస్పెన్షన్ సమయంలో జిల్లా దాటి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విజయవాడ, విశాఖ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు విజయవాడ రైల్వే పీఆర్వో జారీ చేసిన ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు బుధవారం రాత్రి అందాయి. విజయవాడ సమీపాన ట్రాక్‌ల్లో రైల్వే ట్రాఫిక్ నిర్వహణ పనులు జరుగుతున్న సందర్భంగా ఈ మార్పులు చేశారు.

ధనబాద్-అలపుజ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21, 22, 23, 25, 26, 27, 28, 29, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎర్నాకులం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (18637) వారాంతపు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. టాటానగర్-ఎస్ఎమ్వీ బెంగళూరు (12889) వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (12835) వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. జాసిడి-తాంబరం (12376) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 27 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

ఏటీఎం కార్డుతో డబ్బులు రావట్లేదంటే మాయచేసి
లక్షా 22వేలు కొట్టేసాడు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవ రోడ్డుకు చెందిన సుబ్బలక్ష్మి ఈ నెల 10న తాడితోట పెట్రోలు బంకు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు తీసుకోవడానికి వెళ్లింది. కార్డు పెట్టినా డబ్బులు రాలేదు. దీంతో ఏదో సమస్య వుందని అక్కడ వున్న ఒక అపరిచిత వ్యక్తికి చెప్పింది. అతడు తాను ట్రై చేస్తానని చెప్పి కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని చెప్పాడు. దీంతో సదరు మహిళ కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. కట్ చేస్తే... ఆమె ఖాతా నుంచి దఫాదఫాలుగా రూ.1.22 లక్షలు లాగేసాడు. ఫోనుకు వచ్చిన మెసేజ్‌లను కూడా ఆమె చూసుకోలేదు. రెండు రోజుల క్రితం మెసేజ్‌లు చూసుకున్న సుబ్బలక్ష్మి కంగుతింది. బ్యాంకు వారిని కలిసి తాను మోసపోయానని తెలుసుకుని ప్రకాష్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అమలాపురం

పొలం పిలుస్తోంది

అంతర్వేది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వీవీ మెరక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30శాతం వరి కోతలు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



వక్కలంకలో రైతు క్షేత్రాలను పరిశీలిస్తున్న బోసుబాబు

అంబాజీపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.57లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా ఇప్పటి వరకు 48వేల ఎకరాల్లో వరి కోతలు 30శాతం పూర్తి అయిన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వక్కలంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసే పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ జిల్లాలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, కె.గంగవరం, ద్రాక్షారామ, రావులపాలెం, ఆత్రేయపురం తదితర మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి జిల్లాలో 4.32లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికే జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా 377ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈకొనుగోలు కేంద్రాల ద్వారా 4.32లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా 43,400మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు ధాన్యం విక్రయించిన 48గంటల్లో రైతు ఖాతాకు నగదు జమచేస్తామన్నారు. గోనె సంచులు కొరత ఉన్న కేంద్రాల్లో ముందస్తుగా సమాచారం అందిస్తే ఆయా మిల్లర్ల ద్వారా సంచులు ఏర్పాటు చేయిస్తామన్నారు. రబీ సాగుకు సంబంధించి జిల్లాల్లో 1.72లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారన్నారు. రబీలో తెగుళ్లను తట్టుకునేందుకు 1121, బొండాలు, ఎంసీ-13 రకాల సాగు చేయాలన్నారు. ఈనెలాఖరు నాటి నుంచి రబీకి నారుమడులు సిద్ధం కావాలని రైతులకు సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యం కోసిన రైతులు వాటిని వెంటనే ఒబ్బిడి చేసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. వక్కలంకలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన గుత్తుల ధర్మరావు రైతు క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, హార్టీకల్చర్ విస్తరణాధికారి డి.వెంకటేశ్వరరావు, ఏడీవో డి.దుర్గారావు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీరంలో సాగర్ కవాచ్

అంతర్వేది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఉన్న తీర ప్రాంత గ్రామమైన అంతర్వేది నుంచి కరవాక వరకు తీరం వెంబడి సాగర్ కవాచ్ నిర్వహించారు. సివిల్, మెరైన్ పోలీసులు ఈ సాగర్ కవాచ్‌లో పాల్గొన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, పోలీసుస్టేషన్, అంతర్వేది మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ నిర్వహించి తీరం వెంబడి గస్తీ చర్యలు చేపట్టారు.

వ్యాఘ్రేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రులో కొలువుదీరిన శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సూర్యనమస్కారాలు, రుద్రహోమం, అమ్మవార్కి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మాచవరంలో ఉన్న శ్రీపార్వతి రాజేశ్వరిస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన తదితర పూజలు ఘనంగా నిర్వహించారు.

మహిళా సంరక్షణకు చర్యలు

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు తల్లిదండ్రులను మాత్రమే నమ్మాలని, ఇతరులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని ఎస్ఐడి.జ్వాలాసాగర్ సూచించారు. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, డాక్టర్ సర్ రావుబహాదర్ వెంటరత్నంనాయుడు, మహిళా డిగ్రీ కళాశాలలో ఈవీ శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన మహిళా సంరక్షణ అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, గణేశుల సత్యనారాయణ, జగతా సురేష్, పి.శ్రీనివాస్, గుర్రం మహేష్, కె.నాగేంద్ర, వంగా విశాల, ఆకుల దుర్గ, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలు



అమలాపురం గ్రంథాలయంలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలని, ప్రతీ విద్యార్థి గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ తీరిక సమయాల్లో గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ బుధవారం గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవోతో పాటు సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెరిగిన టెక్నాలజీతో పుస్తక పఠనం తగ్గిందన్నారు. అయితే గ్రంథాలయ పఠనం ద్వారా కలిగే విజ్ఞాన సముపార్జన గురించి వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు డీఈవో సలీం బాషా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. గ్రంథాలయ ఉద్యోగులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బందా ఆర్.కామేశ్వరరావు, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, ఆకుల భవానీపాల్గొన్నారు.

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈగ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీ నిర్వహించి వారోత్సవాగ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. జడ్పీ బాలుర హైస్కూలు హెచ్ఎం బీర హనుమంతరావు, లైబ్రేరియన్ శీలం నాగరాజు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈవో ఎం.వెంకన్నబాబు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం మామిడికుదురు శాఖ గ్రంథాలయంలో జరిగింది. వ్యాసరచన, వక్తృత్వం, ఆటల పోటీల్లో విజేతలకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈదరాడ స్కూలు హెచ్ఎం జి.సాయిబాబా, గ్రంథాలయ నిర్వాహకుడు ఎ.సూర్యనారాయణ, టీడీసీ యెరుబండి కన్నబాబు పాల్గొన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో గ్రంథాలయ అధికారి జి.రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. పి.గన్నవరం హైస్కూల్ హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, లిటిల్ యంజల్స్ స్కూల్ కరస్పాండెడ్ జోమి, విశ్రాంత ఉపాధ్యాయుడు సాకా సత్యం, నేలపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని ఎంఈవో-2మోకా ప్రకాష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 57వగ్రంథాలయ వారోత్సవాల ముగింపుకార్యక్రమాన్ని రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): కందికుప్ప శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. కాట్రేనికోన ఎంఈవో-2 ఎం.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. విద్యార్థులతో గ్రంథాలయ సభ్యత్వాలు స్వీకరించారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వడ్డి శ్రీనివాస్, పశువైద్యుడు పి.సుధీర్, గుదే వెంకటేశ్వరరావు, గాంధీ, సుబ్బారావు, కృష్ణమూర్తి, సత్య, గ్రంథాలయాధికారి వి.శ్రీహరిరావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): క్రమంగాతగ్గిపోతున్న పుస్తక పఠనాన్ని పునరుద్ధరించవలసిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ వాసా దివాకర్ అన్నారు. ఉప్పలగుప్తం శాఖాగ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు బహుమతిలందించారు. గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): కేశనపల్లిశాఖగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్.రమేష్‌బాబు, గ్రంథాలయ అధికారి కె.ఇందిరతదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగావిద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను హెచ్ఎం కనకలింగేశ్వరరావు, ఫొటోగ్రాఫర్ బీర అశోక్ చేతులమీదుగా అందించినట్లు గ్రంథాలయ అధికారిణి వై.వెంకటలక్ష్మి తెలిపారు.

ఘనంగా కాపు కార్తీక వనసమారాధన



ఆమ్లక వృక్షం వద్ద పూజలు నిర్వహించిన మెట్ల రమణబాబుతో సంఘీయులు

అమలాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో అమలాపురం గండువీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపం వద్ద బుధవారం కాపు కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆమ్లక వృక్షం వద్ద పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నల్లా శ్రీధర్, నల్లా పవన్‌కుమార్ మాట్లాడారు. కాపు పేద విద్యార్థులను అన్నివిధాలా ఆదుకునేందుకు సంఘం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచి సంఘ అభివృద్ధికి పాటు పడేందుకు తీర్మానించారు. అనంతరం కార్తీక వన సమారాధన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 15వేల మంది సంఘీయులు వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, సీనియర్ నాయకుడు ఆకుల రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, చిక్కాల గణేష్, నల్లా స్వామి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, గంధం పల్లంరాజు, అధికారి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

అయినవిల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీక పంచమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయినవిల్లి శ్రీసిద్ధివినాయకాలయం, ముక్తేశ్వరంలో గల శ్రీముక్తికాంత క్షణ ముక్తీశ్వరాలయం, తొత్తరమూడిలో గల శ్రీరాజ రాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది. క్యూలైన్లు, ఆలయ మండపాలు, రహదారులు భక్తులతో కిక్కిరిశాయి. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించారు.

కుండలేశ్వరంలో భక్తజనం పూజలు

కాట్రేనికోన, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బుధవారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో వేగిరాజు పళ్ళంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో 2000మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, మోటిపల్లి చిన్న, అక్కల నాగమందేశ్వరరావు, గంగుమళ్ళ కిరణ్ పాల్గొన్నారు.

బొమ్మలు కాదు.. నాణేలు



అమలాపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సాధారణంగా నాణేలు గుండ్రంగా గానీ నలుచదరంగా గానీ ఉంటాయి. కానీ సమోవా దేశం విడుదల చేసిన నాణేలు బొమ్మల ఆకారంలో ఉన్నాయి. సింగపూర్ దేశపు అధికార చిహ్నమైన మెర్లయన్ ఆకృతిలో సమోవా దేశం 20సెంట్లు నాణేలను విడుదల చేసింది. చేప శరీరం, సింహపు తల కలిసినట్టుగా ఒక పౌరాణిక జంతువు ఆకారంలో సింగపూర్ దేశపు పూర్వ నామమైన సింహపురను తలపించే విధంగా ఈ నాణేలను విడుదల చేశారు. నాణేనికి ఒకవైపు సింగపూర్ మ్యాప్, నగరం గుండా ప్రవహించే మెరీనాబే నది, సింగపూర్ జాతీయ పుష్పం ఆర్కిడ్‌ను ముద్రించారు. 35 గ్రాముల రాగితో తయారైన ఈనాణేలు 9999 మాత్రమే ముద్రించారు. అరుదైన నాణాన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రత్యేక ఆర్డరుపై రప్పించారు.

హుండీల ఆదాయం రూ.17.47లక్షలు

అమలాపురంటౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయశాఖ తనిఖీదారు ఎ.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మూడునెలల 12రోజులకు హుండీల ఆదాయం రూ.17,47,766 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. కొద్దిగా బంగారు ఆభరణాలు వచ్చాయి. జంగా అబ్బాయి వెంకన్న, పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి 33కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఈదరపల్లి, ఆర్టీసీ బస్టాండు, నారాయణపేట, కూచిమంచి అగ్రహారం, బ్యాంకు రోడ్డు, హైస్కూలు రోడ్డు, సూర్యనగర్, వడ్డిగూడెం రోడ్డు, కళాశాల రోడ్డు, సుబ్బరాజువీధి, తారకరామా నగర్, కంసాల కాలనీ, మండల పరిధిలోని ఇందుపల్లి, సాకుర్రు, నడిపూడి, రామలింగరాజు నగర్, బండారులంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రవికుమార్ తెలిపారు.

ప్రతీ ఒక్కరూ ధ్యానానికి అలవాటు పడాలి

మామిడికుదురు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ మానవుడు తప్పనిసరిగా ధ్యానం చేయాలని సంత్ సదానందగిరిస్వామి మహరాజ్ సూచించారు. లూటుకుర్రు గ్రామంలో గంటా శ్రీహరిరావు శ్రీచక్ర పిరమిడ్ ధ్యాన మందిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా స్వామిమహరాజ్ మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలుగుతుందన్నారు. జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. గంటా సీతారత్నం, మధుసూదనరావు, స్థానికులు పాల్గొన్నారు.

తొమ్మిది బుధవారాలు.. తొమ్మిది ప్రదక్షిణలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నవవార నవ ప్రదక్షిణ దీక్ష నిర్వహించారు. తొమ్మిది బుధవారాలు తొమ్మిది ప్రదక్షిణలు చేస్తూ పదో బుధవారం స్వామివారి నారసింహ సుదర్శన హోమం చేయించుకునే భక్తుల కోర్కెలు నెరవేరుతున్నాయని తెలిపారు. ఆలయ బేడ మండపంలో తొమ్మిది ప్రదక్షిణలు చేసేందుకు భక్తులు క్యూ కట్టారు. బుధవారం జరిగిన సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదానంలో స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

శివపార్వతుల దివ్య కల్యాణం

అమలాపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ఆది దంపతులైన శివపార్వతుల దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు కర్తలుగాను ఆలయ పురోహితులు అంకం మల్లికార్జున, గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో వేదమంత్రోచ్చారణల నడుమ మాంగల్యధారణ నిర్వహించారు. భక్తులకు శ్రీశైలం నుంచి తీసుకువచ్చిన లడ్డూలు, పరిమళ విభూదిని అందజేశారు. అయ్యప్ప స్వాములు, భవానీ మాలధారులకు ప్రసాద వితరణ చేశారు. స్వామివారి దివ్య కల్యాణాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాయకులు మాడా మాదవి, నల్లా స్వామి, పిచ్చిక శ్యామ్, పుత్సల వరదరాజులు, చింతా అత్తిలింగం తదితరులు వీక్షించారు.

షాపుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

పి.గన్నవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా షాపుల వివరాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిన మిషన్ స్మాల్ ఎంటర్ ప్రైజెస్ సర్వే (ఎంఎస్ఎంఈ) యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాప్‌లో ముఖ్యంగా జీఎస్టీ ఉందా లేదా ఏవిధమైన వ్యాపారం చేస్తున్నారు, వ్యాపారానికి కావాల్సిన సరుకులు ఎక్కడ నుంచి కొనుగోలు చేసుకుని తీసుకు వస్తున్నారు, ప్రస్తుత వ్యాపార పరిస్థితి ఎలా జరుగుతుంది తదితర అంశాలతో పాటు ప్రశ్నావళిని పూర్తిస్థాయిలో సేకరించి యాప్‌లో పొందుపర్చాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నా

అమలాపురంటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వీవోఏ(యానిమేటర్ల)లకు రావాల్సిన ఎనిమిది నెలల బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాము వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడుతూ వీవోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అక్రమంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని, యాప్‌ల భారం తగ్గించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిల్లా నలుమూలలనుంచి యానిమేటర్లు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మైక్రోమాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్వేపై శిక్షణ

ముమ్మిడివరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లోని సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై సర్వే నిర్వహించి నివేదికను అందించాలని ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2024 ఎంఎస్ఎంఈ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో చిన్న, మధ్య, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు, వాటికి కావాల్సిన వనరులు తదితర విషయాలపై సర్వే నిర్వహించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ఎస్.విజయ్ సర్వేకు సంబంధించి సూచనలు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సొసైటీల ద్వారా మరిన్ని మెరుగైన సేవలు

అంబాజీపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తున్నామని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఏ.రాధాకృష్ణరావు, సహకార వారోత్సవాల జిల్లా అధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సొసైటీలో సహకార వారోత్సవాలు ముగింపు సభ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఐ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ సొసైటీల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు, రాయితీలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు, నాయకులు గణపతి వీరరాఘవులు, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, రైతు నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆసుపత్రి ప్రారంభం

ముమ్మిడివరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలందించాలని ఎమ్మెల్యేదాట్ల సుబ్బరాజు, డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ముమ్మిడివరంలో డాక్టర్ చోడపనీడి కల్యాణి, మణికంఠలతో నూతనంగా ఏర్పాటుచేసిన మహిక ఆసుపత్రిని బుధవారం వారు ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, వైద్యులు ఎస్.జగన్మోహన్, ఎ.శివకుమార్, వైటీనాయుడు, ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వాడపల్లి ఆలయం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక బుధవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,55,601 లభించినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. సాయంత్రం తూర్పుగోదావరిజిల్లా పెదవాడపల్లికి చెందిన మహిళలు స్వామివారి వసంతమండపంలో లలితా సహస్ర నామ పారాయణం, వేంకటేశ్వర గనామృతం భక్తబృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశేష భక్తజనం ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ శివాలయాల్లో భక్తులు పోటెత్తారు.



లొల్లలో లక్ష బిల్వార్చనలో పూజలు చేస్తున్న మహిళలు

లొల్లలో ఘనంగా లక్ష బిల్వార్చన

రాయవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చనను బుధవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వేదపండితుడు యలమంచలి సత్యనారాయణశర్మ, అర్చకుడు యలమంచలి సుబ్బారావు ఆధ్వర్యంలో వినాయక పూజ, పుణ్యాహ వచనం, రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. అనంతరం స్వామికి లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన, సూర్య నమస్కారాలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు ఈ పూజల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

23న కాశీ విశ్వేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ: రాయవరం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో 23న లక్ష రుద్రాక్ష పూజలు జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వినాయకపూజ, పుణ్యాహ వచనం, పంచగవ్య ఆరాధన, మండపారాధన, సూర్య నమస్కారాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, జ్యోతిర్లింగార్చన జరుగుతాయన్నారు. స్వామివారికి లక్ష రుద్రాక్షపూజ, అమ్మవారికి సహస్రనామ కుంకుమపూజ, శాంతి కల్యాణం జరుపుతామని వారు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం



ర్యాలి అయ్యప్ప ఆలయంలో లక్షపత్రి పూజ చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పదీక్షదారులు, భక్తుల సహకారంతో పలు పూజలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి హోమం, స్వామి వారికి ఏకాదశ నివేదనలతో రుద్రాభిషేకం లక్ష పత్రి పూజ, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను పండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రఘు జరిపారు. వేద మంత్రాలు, అయ్యప్ప శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కాంప్లెక్సు సమావేశంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాష కోరారు. పిల్లావీధి మున్సిపల్ ఉన్నత పాఠశాల లో బుధవారం జరిగిన ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుల కాంప్లెక్సు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు రత్నంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్సు సమావేశాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. డీఈవో వెంట రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహ, సమగ్రశిక్ష సీఎంవో బీవీబీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ద్రాక్షారామలో: ద్రాక్షారామలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో సలీం బాష సందర్శించారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలల్లో అయిదు పాఠశాలల్లో ద్రాక్షారామ ఒకటిగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నపద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలపై సమగ్ర సర్వే జరగాలి

ఆలమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్న, మధ్య, సూక్ష్మతరహా పరిశ్రమలపై సమగ్ర సర్వే జరగాలని ఎంపీడీవో ఏ.రాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల, గ్రామస్థాయి అధికారులకు ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు జరిపారు. ఎంపీడీవో రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.సంతోషి, మండల పరిషత్ ఏవో ప్రకాష్ సర్వేపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు





ఆత్రేయపురం మండలం వెలిచేరు వద్ద ప్రమాదకరమైన రహదారి. పక్క చిత్రంలో ఆత్రేయపురం మండలం ర్యాలి ఆర్అండ్‌బీ రహదారి మలుపు పక్కనే ప్రమాదభరితమైన గొయ్యి

ఆదమరిస్తే...ఇక అంతే

● నరకాన్ని తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారులు ● వాహనదారుల గగ్గోలు

ఆత్రేయపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్కడి రహదారులపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్డు బెర్మ్ దిగితే వాహనాలు పంటకాలువలో బోల్తాపడాల్సిందే. ప్రధాన రహదారుల చెంతనే బెర్ములు లేకపోవడంతో పెద్ద పెద్దగోతులు పడి తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న పలు సంఘటనలున్నాయి. వివరాల్లోకి వెళితే...అమలాపురం-బొబ్బర్లంక ఆర్అండ్‌బీ రహదారి వెలిచేరు వద్ద బెర్ములు లేకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ర్యాలి ఆర్అండ్‌బీ రహదారి అమ్మవారి గుడి మలుపు వద్ద రోడ్డు పక్కనే పెద్ద పెద్ద గోతులు పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. రోడ్డుకు అటు ప్రధాన కాలువ, ఇటు పంటకాలువ ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇక్కడి మలుపుల వద్ద స్థానికులు కర్రలు కట్టి రక్షణ ఏర్పాటు చేశారు. ఈ మలుపుల వద్ద శాశ్వత చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఏజీపీ విద్యా ప్రసన్నకు నాయకుల అభినందనలు



ఆలమూరు కోర్టు ఏజీపీ విద్యాప్రసన్నను అభినందిస్తున్న నాయకులు

ఆలమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బూసి విద్యా ప్రసన్నను పలువురు నాయకులు అభినందించారు. బుధవారం ఆమె కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకులు ఈదల సత్తిబాబు, ఈదల నల్లబాబులు కలసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు ఆమెను అభినందించారు.



మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

సచివాలయ ఉద్యోగులతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల క్రమబద్ధీకరణకు చేపట్టే ర్యాంపు సర్వేపై రూపొందించిన మొబైల్ యాప్‌పై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టీ.వీ.రంగారావు సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు వెళ్లి సర్వే చేసి యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ సర్వే చేయించుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రుణాలు అందుతాయన్నారు. మున్సిపల్ కార్యాల యంలో బుధవారం జరిగిన సమావేశంలో వార్డు కార్యదర్శులు, మున్సిపల్ డీఈఇ శ్రీనివాస్, ఏఇలు పవన్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరించడం దారుణం

రావులపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమని నాయకులన్నారు. రావులపాలెం ఆదిలక్ష్మినగర్‌లో గొల్లపల్లి డేవిడ్‌రాజు అధ్యక్షతన జిల్లా మాలల సన్నద్ధసభ జరిపారు. కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, తదితరులు మాట్లాడగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ఆలమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. మండపేటలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసరావు వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆలమూరు సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎం.రాజేష్ వద్ద రెండు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వాకతిప్ప పీహెచ్‌సీకి ఎన్‌క్యుఎఎస్ సర్టిఫికెట్

కపిలేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీకి పీహెచ్‌సీ స్టాండర్డ్స్ పై 95 శాతం నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యుఎఎస్) కింద క్వాలిటీ సర్టిఫికెట్ లభించింది. ఈనెల 7, 8 తేదీల్లో సెంట్రల్ గవర్నమెంట్ టీం పీహెచ్‌సీ ల్యాబ్, స్టాండర్డ్స్, ఆసుపత్రి పరిశుభ్రత, ఓపీ, ఐపీ, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్, లేబర్ రూం తదితర అంశాలను అప్పట్లో పరిలించారు. పీహెచ్‌సీ పనితీరుపై రాష్ట్రంలో ఎవ్వరికీ రాని విధంగా అత్యధికంగా 95 శాతం తమ పీహెచ్‌సీకి లభించిందని, ఇందుకు జిల్లా బృందం కూడా ప్రశంసించిందని పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్‌చౌదరి, చంద్రమౌళి బుధవారం తెలిపారు. పీహెచ్‌సీకి క్వాలిటీ సర్టిఫికెట్ లభించడంపై పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జగన్‌ను కలిసిన వైసీపీ నేతలు

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన పలువురు వైసీపీ నేతలు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సారధ్యంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. వారిలో షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్‌ఆలీఖాన్ బాబా, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, మున్సిపల్ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, వైసీపీ నేతలు ఎం.మురళి, పి.సత్తిబాబు తదితరులు కలిశారు.



మండపేటలో విజేతలైన వారికి బహుమతులు అందించిన గ్రంథాలయ అధికారి, ఉపాధ్యాయులు



కె.గంగవరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో నాగరాజు



కొత్తపేటలో విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన



కపిలేశ్వరపురంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

మండపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మండపేట శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి పూర్ణమ్మ సారధ్యంలో జరిగాయి. విద్యార్థులకు జరిపిన వివిధ పోటీల్లో విజేతలకు బుధవారం ఏడిద రోడ్డులో వున్న ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వెంకటణేష్, రవికుమార్, శ్రీనివాసరావు సునీత, ఉషారాణి, పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో గ్రూపు-4, సివిల్స్ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఆత్రేయపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎంఈవో వరప్రసాదరావు పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందించారు. గ్రంథాలయాధికారి తంబా నమ్మశివాయ, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో క్రమశిక్షణ సాధ్యం

కొత్తపేట: పుస్తక పఠనంతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు అన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరిపారు. విద్యార్థులకు జరిపిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, సీహెచ్ఎస్ రాణి, ఎవ్వీ జానకీరామ్, కేఎస్ఎన్ ప్రసాద్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వంగా శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు జరిపిన వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అపోస్తలిక్ లైఫ్ చర్చిపాస్టర్ ఏసురత్నం, సీహెచ్ నాగేంద్రప్రసాద్, సతీష్, ఉపాధ్యాయురాలు లలిత, గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం వల్ల లాభాలెన్నో..

కె.గంగవరం: విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని ఎంఈవో ఏ.నాగరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని పామర్రు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు జరిపారు. విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.నాగరాజు, ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసు, అంజిబాబు, ఓవి రమణ, శ్రీను, వీఆర్‌వో ఎం.వీరభద్రరావు, గ్రంథపాలకుడు ఎన్.గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని వక్తలన్నారు. బుధవారం మాచవరంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు జరిపారు. విద్యార్థులకు జరిపిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి టి.ప్రమీల, గ్రంథాలయ పాఠకుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, హైస్కూల్ ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ డి.ఈశ్వరరావు, టీడీపీ నాయకుడు కొండిపూడి చంటిబాబు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం, ద్రాక్షారామ శాఖా గ్రంథాలయాల్లో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలు జరిపారు. రామచంద్రపురం చెలికాని రామారావు స్మారక భవనంలో జరిగిన ముగింపు సభలో ఆర్‌డీవో అఖిల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆర్డీవో ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, చందమామ వాసు, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి రమణ పాల్గొన్నారు. ద్రాక్షారామలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.నాగేంద్ర ప్రసాద్, ఆర్.కె.రాజశేఖర్, ఎస్.దుర్గాభవానీ బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారి ఎంవీ సూరిబాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది కార్తీక వనసమారాధన

ఆత్రేయపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): లొల్లలాకుల వద్ద బుధవారం కార్తీక మాసం సందడి నెలకొంది. ఉసిరిచెట్టు వద్ద ట్రాన్స్‌కో సిబ్బంది ప్రత్యేక పూజలు జరిపారు. అనంత రం సహపంక్తి భోజనాలు చేశారు. ఆ తర్వాత ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు లొల్లలాకుల ప్రాంతంలో కార్తీక వనసమారాధనతో సందడి చేశారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసి వన సమారాధన జరిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద..

రాయవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాయవరం తుల్యభాగ కాలువ సమీపంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద బుధవారం అన్న సమారాధన జరిపారు. బుధవారం ఏకాదశిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేసిన అనంతరం అన్నసమారాధన చేశారు. రాయవరం, మహేంద్రవాడ, వెదురుపాక, లొల్ల, వి.సావరం, కొమరిపాలెం గ్రామాల భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఇంధన వనరులు అందించడమే లక్ష్యం

డీఈఈ రత్నాలరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఇంధన వనరులు సమృద్ధిగా అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఆదాపై దృష్టి కేంద్రీకరించాయని రామచంద్రపురం డివిజనల్ ఇంజనీర్ కె.రత్నాలరావు అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉర్జావీర పథకంపై బుధవారం ఎలక్ట్రిషియన్‌లు, ప్లంబర్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఈ మాట్లాడుతూ ఫైవ్‌స్టార్ రేటింగ్ పరికరాలు వినియోగించడంతో విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఉర్జావీరా పథకంలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం పారితోషికాలు ఇస్తుందన్నారు. గుంటూరులో 22న సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పథకంపై రూరల్ ఏఈ ఎం.వి.రమణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మురళీమోహనరావు, ప్రజా కాంతి ఎలక్ట్రిషియన్, ప్లంబర్ అండ్ రివైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ కృష్ణ, కార్యదర్శి మల్లి కార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈఈ రత్నాలరావు

కోల సంబరం కళాకారులను గుర్తించాలి



కోటయ్య విగ్రహం

ద్రాక్షారామ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోల సంబరం కళకు ఆదిపురుషుడు దివంగత చిక్కాల కోటయ్య అని వక్తలన్నారు. బుధవారం రామచంద్రపురం మండలం వెల్లలో కోల సంబరం కళాకారుడు కోటయ్య విగ్రహావిష్కరణ జరిపారు. సభలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీపీ అంబటి భవానీ తదితరులు మాట్లాడారు. వెంకటేశ్వర దుర్గాదేవి కోలసంబర కళాకారుల కమిటీ అధ్యక్షుడు ఈతా దుర్గారావు మాట్లాడుతూ కోల సంబరం వారిని కళాకారులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, ఎంఎల్‌సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లక్ష్మణరావు తదితరులతో పాటు విగ్రహ శిల్పి వడయార్, గ్రామస్థులు పాల్గొన్నారు.